క్లుప్తంగా

17న జోన్ కబడ్డీ సెలక్షన్స్

హసన్‌పర్తి: ఈనెల 17న హసన్‌పర్తి జోన్ కబడ్డీ సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు జోన్ అధ్యక్షుడు అటికం రవీందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జోన్ పరిధిలోని హసన్‌పర్తి, ఆత్మకూరు, దామెర మండలాలకు చెందిన క్రీడాకారులు అర్హులని పేర్కొన్నారు. ఆదివారం ఎంపికలు జరుగుతాయని తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈనెల 24న నగరంలోని జేఎన్ఎస్ మైదానంలో జరగనున్న ఇంటర్ జోన్ పోటీల్లో పాల్గొంటారని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

ఈ- వ్యర్థాల నిర్వహణపై అవగాహన

పరకాల: సాంకేతిక పరికరాల వినియోగం ద్వారా కాలుష్యం తగ్గించవచ్చని అందులో భాగంగా ఈ -వ్యర్థాల నిర్వహణ ముఖ్యమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంతోష్‌కుమార్ అన్నారు. పరకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలంగాణ అకాడమిక్ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ ప్రాంతీయ అధికారి మామిడి రామకృష్ణ ఆధ్వర్యంలో ఈ- వ్యర్థాల నిర్వహణపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ సదస్సులో రిసోర్స్‌పర్సన్‌గా టాస్క్ మేనేజర్ సుప్రియ, టాస్క్ కోఆర్డినేటర్ రాజశ్రీ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ అరుణ, అకాడమిక్ కోఆర్డినేటర్ సుస్మిత, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి చేయూత



శాయంపేట : మండల కేంద్రానికి చెందిన మాచర్ల శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా 1999-2000 సంవత్సరంలో శ్రీనివాస్‌తో కలిసి పదోతరగతి చదువుకున్న స్నేహితులు చేయూతనిచ్చారు. శ్రీనివాస్ కూతురు నేహ పేరుపై రూ. 38 వేలు పోస్టాఫీస్‌లో డిపాజిట్ చేసి ఆబాండ్‌ను కుటుంబ సభ్యులకు అందజేశారు. కందగట్ల సంతోష్, మార్త సుమన్, బాసని రవి, గుండు రాము, మార్త శ్రీనివాస్, బాసాని భాస్కర్ ఉన్నారు.

బైక్, విద్యుత్ మోటార్లు చోరీ

నడికూడ: ఇంటి ఆవరణంలో ఉంచిన బైక్, విద్యుత్ మోటార్లు చోరీ అయ్యాయి. ఈ సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన గుర్రం కిరణ్‌కు బస్టాండు సమీపంలో ఇల్లు ఉంది. కొన్ని రోజులుగా ఖాళీగా ఉంటుండగా ఆ ఇంటి ఆవరణంలో హీరోహోండా బైక్, రెండు విద్యుత్ మోటార్లు ఉంచారు. కాగా గురువారం ఉదయం చూడగా అవి కనిపించలేదు. దీంతో బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సుమారు రూ. 28,000 విలువగల సొత్తు అపహరణకు గురైందని, న్యాయం చేయాలని బాధితుడు వేడుకున్నాడు.

ట్రాఫిక్ ఎస్సైగా విధుల్లో చేరిన మొగిలి

కాజీపేట: కాజీపేట ట్రాఫిక్ ఎస్సైగా జూనూరి మొగిలి గురువారం విధుల్లో చేరారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ ప్రధాన కార్యాలయంలో కొంతకాలంగా పనిచేస్తున్న మొగిలిని బదిలీ చేస్తూ సీపీ అంబర్ కిశోర్ ఝా ఆదేశాలు జారీ చేశారు. సీఐ సుజాతతో పాటు ఉన్నతాధికారులను ఎస్సైను మర్యాదపూర్వకంగా కలిశారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన అవసరం

మామునూరు: రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులు అవగాహన పెంచుకోవాలని కాజీపేట ట్రాఫిక్ సబ్ ఇన్‌స్పెక్టర్ రావెళ్ల రామారావు సూచించారు. ఈమేరకు ఖిలా వరంగల్ మండలం మామునూరు టీఎస్‌పీఎస్సీ నాలుగో బెటాలియన్‌లో కమాండెంట్ శివ ప్రసాద్‌రెడ్డి పర్యవేక్షణలో జరుగుతున్న స్పెషల్ పోలీసుల 30రోజుల మాన్యువల్ రిఫ్రెష్‌మెంట్ కోర్స్ శిక్షణ శిబిరానికి ఆయన గురువారం హాజరై ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై రామారావు మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలని, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపరాదని అన్నారు. జంక్షన్లలో సిగ్నల్ లైట్లను అనుసరిస్తూ ప్రయాణం చేయాలని సూచించారు. అనంతరం రెగ్యులైజేషన్ రైట్ ఆఫ్ ది వే గోల్డెన్ అవర్, సైన్ బోర్డ్స్ పనితీరుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్సైలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

మానవ సేవయే మాధవ సేవ

వరంగల్: మానసిక, శారీరక ఇబ్బందులతో జీవిస్తున్న వారికి సేవ చేస్తే కొన్ని వేల యజ్ఞాలు చేసిన పుణ్యం వస్తుందని, మానవ సేవయే మాధవ సేవ అని శివానంద గురు కల్చరల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపీచంద్ అన్నారు. గురువు శివానందమూర్తి 95వ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని మల్లికాంబ మనో వికాస కేంద్రంలోని సిబ్బందికి నూతన వస్త్రాలను ములుగురోడ్డు సమీపంలోని గురుధామంలో గురువారం అందజేశారు. మరో ట్రస్టీ సాయి నారాయణ, శక్, మునీర్ ఉన్నారు.

ఆగయే.. చలేగయే

తహసీల్దార్ కార్యాలయంలో 10.30 గంటలకు కూడా హాజరుకాని సిబ్బంది



ఎంపీడీఓ కార్యాలయంలో తాళం తీయకుండా ఉన్న సిబ్బంది గది



సిబ్బంది లేక వెలవెలబోతున్న సురేఖ మండల సమాఖ్య కార్యాలయం





ఉపాధి హామీ కార్యాలయంలో ఖాళీగా ఉన్న కుర్చీ

- సమయపాలన పాటించని అధికారులు
- పడిగాపులు కాస్తున్న ఫిర్యాదు దారులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

శాయంపేట : ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తూ సమయపాలన పాటించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన టైమ్‌టేబుల్‌ను పాటించకుండా తాము సొంతగా తయారు చేసుకున్న టైంను ఫాలో అవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలోని కొంత మంది అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది వ్యవహారంపై మండల ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పది గంటలు దాటినా ఖాళీ కుర్చీలే..

ఉదయం పది గంటలకు రావాల్సిన తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది సమయం దాటినా విధులకు హాజరవ్వడం లేదు. తహసీల్దార్ సుభాషిణి, డీటీ ప్రభావతి, ఆర్ఐ శరత్‌కుమార్, ఏఆర్ఐ హుస్సేన్, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, సిబ్బంది ఉదయం 10.30 గంటలు దాటినప్పటికీ విధులకు హాజరవకపోవడంతో పలు సమస్యల పరిష్కారానికి ఫిర్యాదు చేసేందుకు వచ్చిన వారు అసహనం వ్యక్తం చేశారు. అలాగే ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ఆమంచ కృష్ణమూర్తి మాత్రమే హాజరుకాగా మిగిలిన సిబ్బంది విధులకు హాజరు కాలేదు. ఓ సెక్షన్‌కి సంబంధించిన కార్యాలయం తాళం తీయకపోవడంతో విమర్శలకు దారితీస్తోంది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కార్యాలయంలో ఏపీవో కీర్తి అనిత, సురేఖ మండల సమాఖ్య కార్యాలయంలో ఏపీఎం శ్రీధర్‌రెడ్డి హాజరవ్వగా మిగతా సిబ్బంది సమయానికి హాజరు కాలేదు. ఉదయం పూట సమయం దాటినక వచ్చే అధికారులు, సిబ్బంది.. సాయంత్రం డ్యూటీ ముగిసే సమయం కంటే ముందే వెళ్తున్నారని ప్రజలు ఆగ్రహిస్తున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయంపై ఎంపీడీఓ ఆమంచ కృష్ణమూర్తిని ఫోన్ ద్వారా వివరణ కోరగా.. సిబ్బంది ఆలస్యంగా రాకుండా చూసుకుంటామని, ఇక నుంచి ఎవరైనా ఆలస్యంగా వస్తే సెలవు కింద పరిగణిస్తామని చెప్పారు. భవిష్యత్తులో ఇలా జరుగకుండా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

దుండగులపై కఠిన చర్య తీసుకోవాలి

- పీపీఐడీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం రఘు



మాట్లాడుతున్న గడ్డం రఘు

ఎల్కతుర్తి: పార్లమెంట్ భవనంలోకి విజిట్ పాసులతో ప్రవేశించిన దుండగులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని పీపుల్స్ పార్టీ ఆఫ్ ఇండియా (పీపీఐడీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం రఘు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. భారతదేశంలో శాంతిభద్రతలు కరువయ్యాయని, చట్టాలు అమలు చేసే వ్యక్తులకే భద్రత కరువైందన్నారు. సామాన్య ప్రజల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ హయాంలో ఇలాంటి ఘటనలు జరగడం దురదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పార్లమెంట్‌కు కట్టుదిట్టమైన భద్రత పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంగారపు తిరుపతి, చొక్క రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు దిగిన పోస్టాఫీస్ ఉద్యోగులు



సమ్మెలో పాల్గొన్న పోస్టాఫీస్ ఉద్యోగులు

పరకాల: గ్రామీణ తపాలా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని ఆలిండియా గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం డివిజన్ సెక్రటరీ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. కమలేష్ చంద్ర కమిటీలోని అనుకూల సిఫార్సులను అమలు చేయటంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైనందునకు దేశవ్యాప్త సమ్మెలో భాగంగా పట్టణంలోని హెడ్ పోస్టాఫీస్ ఎదుట గురువారం నిరసనకు దిగామన్నారు. పెరుమండ్ల తిరుపతి, లక్ష్మినారాయణ, కిషన్‌ప్రసాద్, షఫీ, నిర్మల, రాజు, వెంకటేష్, శ్రీలతదేవి పాల్గొన్నారు.

గృహలక్ష్మి ఇళ్లను పరిశీలించిన ప్రత్యేకాధికారులు



ఆత్మకూరు : ఇంటిని పరిశీలిస్తున్న అధికారులు



దామెరలో..

ఆత్మకూరు: గృహలక్ష్మి పథకంలో భాగంగా ఆన్‌లైన్ అయ్యిన గృహాలను మండల ప్రత్యేకాధికారి జి.రాంరెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి గురువారం పరిశీలించారు. మండలంలోని కొత్తగట్టు, తిరుమలగిరి, కామారం, చౌలపల్లి గ్రామాల్లో ఆన్‌లైన్ అయ్యిన 13 గృహాలను సందర్శించి నిర్మాణ పనులను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సందర్శించి నివేదిక సమర్పించనున్నట్లు తెలిపారు.

దామెర: మండలంలోని ఊరుగొండ, దుర్గంపేట, సీతారాంపూర్, పసరగొండ గ్రామాల్లో మండల ప్రత్యేక అధికారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాధవీలత గురువారం సందర్శించారు. అందులో భాగంగా ఇటీవల గృహలక్ష్మి పథకం ద్వారా బేస్‌మీట్ నిర్మించుకున్న గృహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ .. జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్ ఆదేశాల మేరకు గృహలక్ష్మి ఇళ్ల నిర్మాణాలను పరిశీలించినట్లు చెప్పారు. ఆమె వెంట ఎంపీడీఓ కాసర్ల రవీందర్, ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో పాటు పంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

మంత్రిని కలిసిన విశ్వబ్రాహ్మణులు



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

శాయంపేట : రాష్ట్ర అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖను మండలంలోని విశ్వబ్రాహ్మణులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో ఆ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు లాల్‌కోట వెంకటాచారితో కలిసి మంత్రిని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం, మెమొంటో బహూకరించారు. విశ్వబ్రహ్మణులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసేలా కృషి చేయాలని, తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు వేములవాడ మదన్మోహన్, రాష్ట్ర కార్యదర్శి కృష్ణమాచారి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సదానందచారి, హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు వినుకొండ శంకరాచారి ఉన్నారు.

టీఈఏ నూతన కార్యవర్గం ఎన్నిక



రామన్నపేట: తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ (టీఈఏ) వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా బసవరాజ్ కిరణ్, ఎల్.లింగమూర్తి, హనుమకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా బొట్ల రమేష్, గోవిందు నవీన్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యూకూబ్ పాషా తెలిపారు. నగరంలోని సంఘం కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఎన్నికల ప్రక్రియకు యూకూబ్ పాషా ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన ప్రతిహామీని నెరవేర్చాలని కోరారు. గత ప్రభుత్వం కేవలం భజన, బానిస సంఘాలతో మాత్రమే సంప్రదిస్తూ గుప్పెడు నాయకులకు ప్రయోజనం చేసిందని విమర్శించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే మినిస్టర్‌తో కూడిన కమిటీని వేసి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులను పలువురు అభినందించారు. కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ కృష్ణప్రసాద్, వెంకటేశ్వర్లు, ఎండీ రెహమాన్, ఎస్.కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

మద్య విమోచన కమిటీని పునరుద్ధరించాలి

ఖిలా వరంగల్: ఉమ్మడి రాష్ట్రంలో పనిచేసిన మద్య విమోచన కమిటీని తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం పునరుద్ధరించాలని విమోచన ప్రచార కమిటీ మాజీ డైరెక్టర్, కాంగ్రెస్ నేత దాసి రాందేవ్ కోరారు. ఈమేరకు హైదరాబాద్‌లోని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణరావును గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాందేవ్ మాట్లాడుతూ.. నగరాలు, పట్టణాలు, గ్రామాల్లోని బెల్ట్‌షాపుల మూసివేతకు నిర్ణయం తీసుకోవాలని సూచించారు. కల్తీ మద్యం, గుడుంబా, బెల్ట్‌షాపులపై నిషేధ కమిటీ ఏర్పాటు చేయాలని మంత్రిని కోరినట్లు ఆయన తెలిపారు.

వడ్డేపల్లి కట్టపై కోతుల పట్టివేత

కాజీపేట: వడ్డేపల్లి రిజర్వాయర్ కట్టపై ఉన్న పార్కులో పర్యాటకులపై దాడులు చేస్తూ గాయపరుస్తున్న కోతుల గుంపును మున్సిపల్ సిబ్బంది గురువారం పట్టుకున్నారు. ఇటీవలి కాలంలో కట్టపై కోతుల బెడద ఎక్కువైంది. పర్యాటకులతో పాటు ఉదయం వేళ పార్కులోకి వాకింగ్ కోసం వచ్చే వారిపై అవి దాడులు చేస్తున్నాయి. ఈ విషయాన్ని మేయర్ గుండు సుధారాణి దృష్టికి 61వ డివిజన్ కార్పొరేటర్ ఎలకంటి రాములు తీసుకెళ్లారు. ప్రత్యేక సిబ్బంది వచ్చి కోతులను పట్టుకుని శానిటరీ అధికారుల ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనంలో అటవీ ప్రాంతానికి తరలించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

హసన్‌పర్తి: అనారోగ్య సమస్యలతో మృతిచెందిన హసన్‌పర్తి మండల కేంద్రానికి చెందిన మేకల యేసు రత్నం మృతదేహాన్ని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. బాధిత కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శివకుమార్, డివిజన్ అధ్యక్షుడు మేకల హరి, నాయకుడు తాళ్ల రమేష్‌తో పాటు తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ సెంటర్‌లో ప్రీ క్రిస్మస్ వేడుకలు



ఎల్కతుర్తి: మండలంలోని కేశవాపూర్ ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ సెంటర్‌లో చిన్నారులు ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు, విద్యార్థినులు కేక్‌కట్ చేసి సంబురాలు జరిపారు. అలాగే చిన్నారులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పోషణ్ అభియాన్ బ్లాక్ కోర్డినేటర్ తేజశ్రీ, సూపర్‌వైజర్ సుజాత, అంగన్‌వాడీ కార్యకర్త ఇనుగాల వసంత, కాంగ్రెస్ నాయకుడు ఇనుగాల శ్రీనివాస్, పాఠశాల హెచ్ఎం, పాల్గొన్నారు.

ఆటో వదిలి.. కొత్తిమీర పట్టి



కొత్తిమీర అమ్ముతూ నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్లు

కమలాపూర్: మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం అందించిన రాష్ట్ర ప్రభుత్వం తమ పరిస్థితిని ఆలోచించి న్యాయం చేయాలని ఆటో డ్రైవర్లు వేడుకున్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆటో నడుపుకుంటూ జీవనం సాగించే తాము జీవనోపాధి కోల్పోయామని వాపోయారు. ఈ మేరకు మండలంలోని ఆటో డ్రైవర్లు గురువారం ఆటోలు వదిలి రోడ్డుపై ఇలా కొత్తిమీర అమ్ముతూ వినూత్నంగా నిరసన చేపట్టారు.

ఆర్థికాభివృద్ధితో మహిళా సాధికారత సాధ్యం

- జేఎస్ఎస్ డైరెక్టర్ ఖాజా మసియొద్దీన్



మాట్లాడుతున్న డైరెక్టర్ మసియొద్దీన్

దామెర: ఆర్థికాభివృద్ధితో మహిళా సాధికారత సాధ్యమని జనశిక్షణ సంస్థాన్ సంచాలకుడు ఖాజా మసియొద్దీన్ అన్నారు. మండలంలోని సింగరాజుపల్లిలో జేఎస్ఎస్ ఆధ్వర్యంలో ఉచిత బ్యూటీషియన్ శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఉచిత శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకుని మహిళలు వ్యాపార రంగంలో ఎదగాలని సూచించారు. అనంతరం సఖి వన్ స్టాప్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లోని యువతులు ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కోఆర్డినేటర్ తిరుపతి, ఏపీఓ రాజు, సుజిత్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జంగం రాణి, కేస్ వర్కర్ వినీల, సరిత, రిసోర్స్‌పర్సన్ బొచ్చు నవ్య, అంగన్‌వాడీ సిబ్బంది వాణి, సిరి గ్రామాఖ్య సంఘం సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి



మాట్లాడుతున్న సర్పంచ్ రాజు

ఆత్మకూరు: ప్లాస్టిక్ వినియోగంతో అనేక అనర్థాలు జరుగుతున్నాయని, ప్రజలు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని ఆత్మకూరు సర్పంచ్ పర్వతగిరి రాజు కోరారు. మండల కేంద్రంలో మా సోషల్ యాక్టివిటీస్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం పర్యావరణ పరిరక్షణ .. ప్లాస్టిక్ నివారణ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ప్రతి అవసరానికి ప్లాస్టిక్ కవర్లు వాడకుండా ఇంటివద్ద నుంచి ప్రత్యామ్నాయంగా కాటన్ బ్యాగులు తీసుకుని వెళ్లాలని కోరారు. గ్రామాల నుంచే ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని అన్నారు. సంస్థ జనరల్ సెక్రటరీ నాగబండి శివప్రసాద్, పంచాయతీ కార్యదర్శి యాదగిరి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

టైలరింగ్ శిక్షణను వినియోగించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న గోపాల్

శాయంపేట : టైలరింగ్ శిక్షణను మహిళలు వినియోగించుకోవాలని నవయుగ సొసైటీ అధ్యక్షుడు కోసరి గోపాల్ సూచించారు. మండలంలోని గట్లకానిపర్తి గ్రామంలో ప్రజ్వల్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ వారు జనశిక్షణ సంస్థాన్ సహకారంతో టైలరింగ్ శిక్షణ శిబిరం ఏర్పాటు చేయగా ఆయన హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహిళలకు మూడు నెలలపాటు శిక్షణ ఇవ్వడంతో పాటు సర్టిఫికెట్ కూడా అందిస్తామని చెప్పారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే దేశం పురోగతి సాధిస్తుందని అన్నారు. ఈ శిక్షణను మహిళలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఫెసిలిటర్ కల్పన, జనశిక్షణ సంస్థాన్ అధికారులు, ప్రజ్వల్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ ప్రొడ్యూసర్ యూనిట్ మేనేజర్ ప్రియాంకరెడ్డి, ఉపసర్పంచ్ సురేందర్, బీసీఐ రైతు దేవేందర్‌రెడ్డి, ఫీల్డ్ ఫెసిలిటర్లు హిమబిందు, సునీల్, తిరుపతి, గౌస్, ప్రశాంత్, ట్రైనర్ మమత, మహిళలు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

- నాబార్డు డీడీఎం ఎల్.చంద్రశేఖర్



మాట్లాడుతున్న నాబార్డు డీడీఎం చంద్రశేఖర్

వేలేరు : జ్యూట్ బ్యాగుల తయారీకి ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు నాబార్డు డీడీఎం ఎల్.చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని పీచర రైతువేదిక వద్ద జ్యూట్ బ్యాగుల తయారీపై 15రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సహాయ సోషల్ సర్వీస్ సేవా సొసైటీ ఆధ్వర్యంలో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని, జ్యూట్ బ్యాగుల వాడకాన్ని ప్రోత్సహించాలని అన్నారు. జ్యూట్ బ్యాగులతో పాటు లంచ్ బాక్సులు, క్యారీబ్యాగులు, పర్సులు, సెల్‌ఫోన్ కవర్‌లు, ఆఫీస్ బ్యాగులు తదితర బ్యాగులను తయారీ చేస్తూ ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్, వేలేరు ఎస్‌బీఐ మేనేజర్ అక్తరున్నీసా, ఏఈఓ బాబు, ఫీల్డ్ ఆఫీసర్ శ్రవణ్ కూమార్, సహయ సంస్థ కార్యదర్శి విజయ్‌కుమార్, మహిళలు పాల్గొన్నారు.

అడ్డొచ్చిన కోతి.. వాహనదారుడికి గాయాలు



ఎంజీఎం ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

కమలాపూర్: కోతి అడ్డుగా రావడంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడిన వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని గూడూరు-అంబాల గ్రామాల మధ్య గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్మెటకు చెందిన క్రాంతి గూడూరులోని తన బంధువుల ఇంటికొచ్చి తిరిగి బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో గూడూరు-అంబాల గ్రామాల మధ్య కోతి బైక్‌కు అడ్డుగా వచ్చి బైక్ కిందకు చొరబడింది. దీంతో బైక్ అదుపుతప్పి క్రాంతి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలుకాగా స్థానికులు 108కి సమాచారం ఇచ్చినా సమయానికి రాకపోవడంతో అటుగా వస్తున్న రాములపల్లికి చెందిన డాక్టర్ బైరి నరేష్ కారులో క్షతగాత్రుడిని మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

సైన్స్‌ఫెయిర్‌లో గురుకుల విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

శాయంపేట : హనుమకొండ జిల్లా మడికొండలోని సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీలో గురువారం నిర్వహించిన జోనల్ స్థాయి విద్య వైజ్ఞానిక ప్రదర్శనలో మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబర్చి తృతీయ బహుమతి సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సుభాషినిదేవి తెలిపారు. ఈ వైజ్ఞానిక ప్రదర్శనలో ఆరు జిల్లాల నుంచి 60 పాఠశాలలు, 120 ఎగ్జిబిట్లు ప్రదర్శించినట్లు తెలిపారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన పర్యావరణ సమస్యలు, వాటి పరిష్కారం అనే అంశంపై కాలుష్య నివారణ యంత్రం ఎగ్జిబిట్‌కు తృతీయ బహుమతి లభించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు సైన్స్ పట్ల మక్కువ పెంచుకోవాలని సూచించారు. వివిధ రకాల ఎగ్జిబిట్లు తయారు చేయాలని అన్నారు. గైడ్ టీచర్ వసంత, విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించినట్లు తెలిపారు.